క్లుప్తంగా

కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తీసుకొస్తా

● మలక్‌పేట అభ్యర్థి షేక్ అక్బర్



అక్బర్‌బాగ్‌లో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న షేక్ అక్బర్

చాదర్‌ఘాట్: మలక్‌పేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చి ఈసారి విజయకేతనం ఎగురవేస్తానని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ అక్బర్ అన్నారు. శుక్రవారం అక్బర్‌బాగ్‌లో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత ప్రభుత్వానికి, ఆ పార్టీ మిత్ర పక్షాలకు ప్రత్యామ్నాయం కాంగ్రెస్ పార్టీ అన్నారు. కాంగ్రెస్ సామాన్యుల పార్టీ అని, నాయకులు అందరికీ అందుబాటులో ఉండి అభివృద్ధిని కాంక్షిస్తారన్నారు. నియోజకవర్గంలో ప్రతీ కార్యకర్త కలిసికట్టుగా పని చేసి మలక్‌పేటలో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని కోరారు. ప్రజల నుంచి తన ప్రచారానికి విశేష స్పందన వస్తోందన్నారు. 30 రోజుల్లో అధికారంలోకి కాంగ్రెస్ పార్టీ వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు త్రివేణి విద్యార్థిని ఎంపిక



లహరికి మెరిట్ సర్టిఫికెట్ అందజేస్తున్న రాఘవరెడ్డి

సైదాబాద్: చంపాపేటలోని శ్రీత్రివేణి ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని లహరి రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికైంది. శుక్రవారం పాఠశాల కరస్పాండెంట్ కె.గోవర్ధన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సరూర్‌నగర్‌లో శుక్రవారం నిర్వహించిన ఉమ్మడి రంగారెడ్డి జిల్లా స్థాయి యోగా పోటీల్లో లహరి ఉత్తమ ప్రదర్శన కనబరిచింది. ఈమెకు పీఈటీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాఘవరెడ్డి సర్టిఫికెట్‌ను అందజేశారు. ఈనెల 30న సిద్దిపేటలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో లహరి అవకాశం దక్కించుకుందని నిర్వాహకులు తెలిపారు.

తల్లిదండ్రుల ఆశీర్వాదంతో..

● ప్రచారాన్ని ప్రారంభించిన అందెల


బడంగ్‌పేట్: బడంగ్‌పేట కార్పొరేషన్‌లో పలు పార్టీల అభ్యర్థులు ప్రచారం మొదలు పెట్టారు. బీజేపీ మహేశ్వరం నియోజకవర్గం అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్ మొదట తల్లితండ్రుల ఆశీర్వాదం తీసుకొని ప్రచారంలో పాల్గొన్నారు. అనంతరం తన సొంత గ్రామమైన నాదర్‌గుల్‌లో సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం బీజేపీ నేతలతో, కార్యకర్తలతో కలిసి అందెల శ్రీరాములు ప్రచారం చేశారు. మీ అమూల్యమైన ఓటును కమలం గుర్తుకే వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ఆయన వెంట పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్లు మహిళలు ఉన్నారు.

ఘనంగా దుర్గామాత ఊరేగింపులు



కుర్మగూడలో నవరాత్రి ముగింపు వేడుకల్లో యువకులు

చంచల్‌గూడ: దేవీ శరన్నవరాత్రులు ముగిసిన నేపథ్యంలో కుర్మగూడ డివిజన్ పరిధిలో ప్రతిష్ఠించిన దుర్గామాత విగ్రహాల నిమజ్జనోత్సవాలు ముగిశాయి. దసరా మరుసటి రోజు నుంచి మండపాల నిర్వాహకులు దుర్గామాత ఊరేగింపు ఉత్సవాలు నిర్వహించారు. గురువారం రాత్రి మాదన్నపేట, ఉప్పరిగూడ, కుర్మగూడ, పూలతోట బస్తీల్లో అమ్మవారి విగ్రహాన్ని బ్యాండ్ మేళాల మధ్య వాడవాడలా ఊరేగించారు. మహిళలు మంగళహారతులతో అమ్మవారికి వీడ్కోలు పలికారు. యాకుత్‌పురా బీజేపీ అభ్యర్థి ఎన్. వీరేందర్‌యాదవ్ ఊరేగింపులో పాల్గొన్న మండపాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఊరేగింపులో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా మాదన్నపేట సీఐ కె.సునీల్ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు నిర్వహించారు.



మాదన్నపేటలో ప్రత్యేక పూజలు చేస్తున్న వీరేందర్‌యాదవ్

ఓటరు పత్రంపై అక్షర దోషాలున్నా..
ఓటు హక్కుకు ఆటంకం కలిగించొద్దు!

జంగ్ తెలంగాణ 2023

● ఏజెంట్ల అభ్యంతరాలను పరిశీలించాలి
● పీఓలకు, ఏపీఓలకు ఆర్‌ఓ ఆదేశం



పీఓలు, ఏపీఓల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న మలక్‌పేట ఆర్‌ఓ ఉపేందర్‌రెడ్డి

మలక్‌పేట: త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మలక్‌పేట ముంతాజ్ కాలేజీలో శుక్రవారం ప్రొసీడింగ్ అధికారులు (పీఓ), సహాయ ప్రొసీడింగ్ అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. మలక్‌పేట ఆర్‌ఓ ఉపేందర్‌రెడ్డి, స్పెషల్ ఆఫీసర్ గీతారాధిక, జీహెచ్‌ఎంసీ డీసీ జయంత్, పీఓ యుగేందర్‌రెడ్డి హాజరై పోలింగ్ కేంద్రాల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఓటరు కార్డును, తీసుకొచ్చిన వివరాలను పరిశీలించి ఓటు వేసేందుకు అవకాశం కల్పించాలన్నారు. ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఓటరు పత్రం ప్రామాణికం కాదని, అది కేవలం సమాచార పత్రం మాత్రమేనని, జాబితాలో లేదా.. ఓటరు పత్రంలో అక్షర దోషాలు ఉన్నా..ఓటు హక్కుకు ఎలాంటి ఆటంకం కలిగించవద్దన్నారు. ఏజెంట్లు అభ్యంతరాలు వ్యక్తం చేస్తే వాటిని పరిశీలించి అనుమతించాలన్నారు. ఎన్నికల సంఘం గతం నుంచి ఆమోదిస్తున్న 12 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి చూపించినా సరిపోతుందన్నారు. ఈవీఎంల పనితీరుపై డెమో నిర్వహించారు. ఈవీఎం మొరాయిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కేటాయించిన పోలింగ్ కేంద్రానికి పోలింగ్ ముందే చేరుకోవాలన్నారు.ఎన్నికలు సజావుగా కొనసాగడానికి పోలీసుల సహకారం తీసుకోవాలన్నారు. ఉదయం 200 మందికి, మధ్యాహ్నం 200 మందికి రెండు విడతలుగా 400 మంది అధికారులకు శిక్షణ తరగతులు జరిగాయి. శనివారం మరో 400 మంది అధికారులకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఆర్‌ఓ తెలిపారు.

మధుయాష్కీని వరించిన కాంగ్రెస్ టికెట్



మధుయాష్కీగౌడ్

ఎల్‌బీనగర్: ఎల్బీనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ టికెట్ ఆ పార్టీ సీనియర్ నేత మధుయాష్కీ గౌడ్‌ను వరించింది. కాంగ్రెస్ అధిష్ఠానం శుక్రవారం విడుదల చేసిన జాబితాలో ఎల్‌బీనగర్ నియోజకవర్గ అభ్యర్థిగా మధుయాష్కీ పేరును ప్రకటించింది. మొదటిసారిగా ఎల్‌బీనగర్ నుంచి మధుయాష్కీగౌడ్ బరిలోకి దిగుతుండటం గమనార్హం. ఈయన 2004, 2014లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికయ్యారు. 2019లో నిజామాబాద్ నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఈసారి అసెంబ్లీకి పోటీ చేయాలనే ఉద్దేశంతో ఎల్‌బీనగర్‌ను ఎంచుకుని టికెట్ దక్కించుకున్నారు. ఎల్‌బీనగర్‌లో మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో బలమైన బీసీ నాయకుడు కావడం వల్ల ఇక్కడ నుంచి మధుయాష్కీ తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. ఈయనకు కాంగ్రెస్ పార్టీలో పలు కీలకమైన పదవులు నిర్వహించడంతో పాటు కాంగ్రెస్ పార్టీ నుంచి కర్ణాటక రాష్ట్ర ఎన్నికల ఇన్‌ఛార్జిగా, మధ్యప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల ఇన్‌ఛార్జిగా పని చేసిన అనుభవం ఉంది.

బయోడేటా...

అభ్యర్థి: మధుయాష్కీగౌడ్
పుట్టిన సంవత్సరం: 1958
చదువు: ఎల్ఎల్ఎం
రాజకీయ నేపథ్యం:

- 2004లో కాంగ్రెస్‌పార్టీలో చేరిక
- రెండుసార్లు నిజామాబాద్ ఎంపీగా ఎన్నిక
- కాంగ్రెస్‌పార్టీకి లోక్‌సభ డిప్యూటీ విప్‌గా పని చేశారు.
- ప్రస్తుతం ఏఐసీసీ కార్యదర్శిగా, తెలంగాణ రాష్ట్ర పీసీసీ కమిటీ ప్రచార కమిటీ చైర్మన్‌గా, ఏఐసీసీ స్పోక్స్‌మెన్‌గా కొనసాగుతున్నారు.

ఎన్నికల విధులకు గైర్హాజరైతే కఠిన చర్యలు

మలక్‌పేట నియోజకవర్గం ఏఆర్‌ఓ జయంత్



ఏఆర్‌ఓ జయంత్

చాదర్‌ఘాట్: అసెంబ్లీ ఎన్నికల విధుల్లో ఉన్న ప్రతీ ఉద్యోగి తప్పనిసరిగా ప్రతి శిక్షణ కార్యక్రమానికి హాజరు కావాలని మలక్‌పేట నియోజకవర్గం అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి జయంత్ అన్నారు. శుక్రవారం ఆయన మలక్‌పేటలోని కార్యాలయంలో మాట్లాడుతూ, విధుల్లో అలసత్వం వహించడంతో పాటు గైర్హాజరైతే ఉద్యోగులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల సంఘం ఉద్యోగుల గైర్హాజర్‌పై సీరియస్‌గా ఉందని అందువల్ల ప్రతీఒక్కరూ జాగ్రత్తగా పని చేయాలని, ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా కఠిన చర్యలు తప్పవన్నారు.

సమన్వయంతో పని చేసి అభ్యర్థిని గెలిపించండి



మాట్లాడుతున్న కర్ణాటక ఎమ్మెల్యే మునిరత్నం నాయుడు

ఎల్‌బీనగర్: వచ్చే ఎన్నికల్లో శక్తి కేంద్రం, బూత్ కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేసి అభ్యర్థి విజయానికి కృషి చేయాలని కర్ణాటక శాసన సభ్యుడు మునిరత్నం నాయుడు అన్నారు. బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలో ఉన్న శ్రీ కన్వెన్షన్ హాల్ శుక్రవారం నిర్వహించిన శక్తికేంద్రం, బూత్‌కమిటీల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు దొందూ దొందే అని అన్నారు. త్వరలోనే అభ్యర్థిని ప్రకటిస్తారని, అందరు బీజేపీ విజయానికి కృషి చేయాలని కోరారు. పార్టీ విజయానికి శక్తికేంద్రం ఇంచార్జీలు, బూత్‌కమిటీ సభ్యులు ఇంటింటికీ వెళ్లి కేంద్రం చేస్తున్న అభివృద్ధి పనులను, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. సమావేశంలో రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, డివిజన్ బీజేపీ అధ్యక్షుడు నవకిశోర్‌రెడ్డి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శివాజీ చౌక్‌లో అక్రమ పార్కింగ్‌లను అడ్డుకోవాలి

చైతన్యపురి: చైతన్యపురి డివిజన్ సాయినగర్ కాలనీలోని శివాజీ చౌక్ వద్ద అక్రమ పార్కింగ్‌లు జరగకుండా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు. కార్లు, బైక్‌లు ఇష్టారాజ్యంగా ఎక్కడ బడితే అక్కడ పార్కింగ్ చేయటం వల్ల వాహనాల రాకపోకలకే కాక పాదచారులకు ఇబ్బందులు కలుగుతున్నాయని అంటున్నారు. కాలనీలో ఉన్న కమర్షియల్ కాంప్లెక్స్‌లు, కార్యాలయాలకు పార్కింగ్ స్థలాలు లేకపోవటంతో అక్కడికి వచ్చేవారు తమ తమ వాహనాలను శివాజీ చౌక్ చుట్టూ అక్రమంగా పార్కింగ్ చేస్తున్నారని కాలనీవాసులు చెప్తున్నారు. అంతేకాక చైతన్యపురి మెట్రో ప్రయాణికులు తమ వాహనాలను కాలనీ రహదారుల్లో పార్కు చేయటం వల్ల కాలనీ అక్రమ పార్కింగ్‌లకు అడ్డాగా మారిందంటున్నారు. అక్రమ పార్కింగ్‌లు జరగకుండా సూచిక బోర్డులు పెట్టి తగిన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

రేపు బ్రాహ్మణ వధూవరుల పరిచయ వేదిక

వనస్థలిపురం: బ్రాహ్మణ వెల్ఫేర్ అసోసియేషన్, వనస్థలిపురం ఆధ్వర్యంలో బ్రాహ్మణ వధూవరుల 15వ వార్షిక పరిచయ వేదికను ఈ నెల 29న వనస్థలిపురంలోని శ్రీ సీతారామచంద్ర ఆలయం ప్రాంగణంలో నిర్వహిస్తామని అసోసియేషన్ అధ్యక్షుడు పోచంపల్లి శ్రీధరరావు, కార్యదర్శి నందిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరిచయ వేదిక కొనసాగుతుందన్నారు. స్పాట్ రిజిస్ట్రేషన్ కలదని, ఇతర వివరాలకు ఫోన్ నం. 6302454218ను సంప్రదించాలన్నారు.

ప్రజాస్వామ్యం బలోపేతానికి ఓటు వేయాలి



మాట్లాడుతున్న ఎస్‌హెచ్‌పీఎస్ చైర్మన్ కేశవులు

సైదాబాద్: రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కును వినియోగించుకొని ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి అందరూ పాటుపడాలని సమాచార హక్కు పరిరక్షణ సమితి (ఎస్‌హెచ్‌పీఎస్) జాతీయ చైర్మన్ డాక్టర్ బొమ్మరబోయిన కేశవులు కోరారు. శుక్రవారం సైదాబాద్‌లోని సమితి రాష్ట్ర కార్యాలయంలో ఆయన ఎస్‌హెచ్‌పీఎస్ హైదరాబాద్ కన్వీనర్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఓటర్లు తమకు నచ్చిన వ్యక్తికి ఓటు వేయాలని, ఎవరూ నచ్చకపోతే నోటాకు ఓటు వేయాలని సూచించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ప్రలోభాలాకు గురి చేయడానికి వస్తారని, ఓటర్లు ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ సీఈఓ ఆదేశాల మేరకు ఎస్‌హెచ్‌పీఎస్, ఎలక్షన్ వాచ్ కమిటీ ఆధ్వర్యంలో ఎన్నికల్లో అక్రమాల నిరోధానికి రాష్ట్ర వ్యాప్తంగా ఓటర్ చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఓటర్లు కూడా తమ పరిధిలో గుర్తించిన అక్రమాలను సీ-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రచారం

హస్తినాపురం: నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించి ఎల్‌బీనగర్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దిన ఘనత ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డికే దక్కిందని హస్తినాపురం డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఆండోజు సత్యంచారి అన్నారు. శుక్రవారం హస్తినాపురంలో కార్యకర్తలతో కలిసి డివిజన్‌లో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రచారం చేశారు. పార్టీ నాయకులు నారగోని శ్రీనివాస్ యాదవ్, పద్మానాయక్, డేరింగుల కృష్ణ, నల్ల నాగిరెడ్డి, బాలం ఈశ్వర్, కంచర్ల శివారెడ్డి పాల్గొన్నారు.

రైతు బజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు... (కిలో... రూపాయల్లో) టమాటా 17, వంకాయ 28, బెండ 28, పచ్చిమిర్చి 40, కాకర 23, బీర 23, క్యాబేజీ 16, ఫ్రెంచిబీన్స్ 65, క్యారెట్ 40, దొండ 15-18, చిక్కుడు 35-65, గోకర 28.

ఉచిత న్యాయ సహాయాన్ని వినియోగించుకోవాలి



ఎల్‌బీనగర్‌లోని లైఫ్ ఫౌండేషన్ కేంద్రాన్ని సందర్శించిన సీనియర్ సివిల్ జడ్జి ఇందిర

నాగోలు: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని రంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి డి.ఇందిర అన్నారు. శుక్రవారం ఎల్‌బీనగర్ ఆర్టీసీ కాలనీలోని రంగారెడ్డి జిల్లా న్యాయ సేవా సేవాధికారసంస్థ ఆధ్వర్యంలో లైఫ్ ఫౌండేషన్ ఉచిత న్యాయ సలహా కేంద్రాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఇందిర సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సత్వర న్యాయ సహాయం కోసం రంగారెడ్డి జిల్లా వాసులు ఎవరైనా ఈ ఉచిత న్యాయ సేవ కేంద్రం ద్వారా సహాయం పొందవచ్చన్నారు. ఈ సందర్భంగా న్యాయ సేవ కోసం వచ్చిన బాధితుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అందరూ చట్టలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. అందరికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిరంతరం చట్టాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది, లైఫ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ పప్పుల సుధాకర్, పారా లీగల్ వలంటీర్లు విజయలక్ష్మి, డాక్టర్ సలేంద్రకుమార్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మరోసారి గెలిపిస్తే.. మరింత అభివృద్ధి

● ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

నాగోలు: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో ఎన్నో ఏళ్లుగా ఉన్న దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం కృషి చేశానని, వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి చేశానని ఎల్‌బీనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆయన కోరారు. శుక్రవారం నాగోల్ డివిజన్ జైపురికాలనీలోని హనుమాన్ ఆలయంలో సుధీర్‌రెడ్డి, సతీమణి కమలతో కలిసి ప్రత్యేక పూజలు చేసి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశ పెట్టిన ఎన్నికల మేనిఫెస్టో చూసి ప్రత్యర్థుల గుండెల్లో రైళ్లు పరిగెత్తుతున్నాయన్నారు. మరోసారి తనను గెలిపిస్తే రెట్టింపు అభివృద్ధి చేసి చూపిస్తానని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొగ్గరాపు దయనంద్ గుప్తా, మాజీ కార్పొరేటర్ చెరుకు సంగీత ప్రశాంత్ గౌడ్,బీఆర్ఎ సీనియర్ నాయకులు ఆనంతుల రాజిరెడ్డి, డివిజన్ అధ్యక్షుడు తూర్పాటి చిరంజీవి, మహిళా అధ్యక్షురాలు ప్రమీల, సీతారాములు గౌడ్, చంద్రశేఖర్ ఆజాద్ తదితరులు పాల్గొన్నారు.

హోం టూ ఓటుపై అవగాహన కల్పిస్తున్నాం

మలక్‌పేట నియోజకవర్గ ఆర్‌ఓ ఉపేందర్‌రెడ్డి



చాదర్‌ఘాట్: అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్నికల సంఘం కొత్తగా 80 సంవత్సరాలు దాటిన వారికి, దివ్యాంగులకు హోం టూ ఓటు అనే విధానాన్ని తీసుకొచ్చిందని, ఈ విధానంపై ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నామని మలక్‌పేట నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ కె.వెంకట ఉపేందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మలక్‌పేటలోని కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, ఆయా బూత్‌లలో 80 సంవత్సరాలు దాటిన వారిని, దివ్యాంగులను గుర్తించి ముందుగానే వారితో బీఎల్‌ఓలు డిక్లరేషన్ తీసుకుంటారన్నారు. ఇంటి నుంచి ఓటు వేసే వారికి ఫామ్-12(డి)ని ముందుగానే అందిస్తారన్నారు. రెండు రోజుల్లో వారు ఫామ్‌ను నింపి బీఎల్‌ఓలకు లేదా.. కార్యాలయంలో గానీ ఇస్తే ఓటింగ్ రోజున ఇంటి నుంచే ఓటు వేసే వెసులుబాటు కల్పిస్తామన్నారు.

ఇంటింటికి ఐయామ్ ఏ ఓటర్ స్టిక్కర్లు...

ఈసారి వినూత్నంగా ఓటర్లలో చైతన్యం నింపేందుకు ప్రతి ఓటరు ఇంటి గోడపై లేదా తలుపులపై ఐయామ్ ఏ ఓటర్ అనే స్టిక్కర్లు ఇంటింటికీ తిరిగి అతికించాలని బీఎల్‌ఓలకు ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. స్టిక్కర్లపై ఆ ఓటరు ఓటు వేసే పోలింగ్ బూత్ వివరాలను కూడా నమోదు చేయాలని బీఎల్‌ఓలకు తెలిపారు.దాంతో ఆయా ఓటరు ఏ పోలింగ్ బూత్‌కు వెళ్లి ఓటు వేయాలనే విషయం తేలికగా తెలుసుకుంటారన్నారు.

కాంగ్రెస్ సీనియర్ నేత మృతి

బడంగ్‌పేట్: బడంగ్‌పేట మాజీ ఉపసర్పంచ్, కాంగ్రెస్ పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు పెద్దబావి వెంకట్‌రెడ్డి(55) శుక్రవారం మృతిచెందాడు. ఇటీవల వినాయక చవితి వేడుకల్లో భాగంగా బడంగ్‌పేట వీరాంజనేయ భక్త సమాజం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక లడ్డూను వెంకట్‌రెడ్డి రూ.17లక్షలకు కైవసం చేసుకుని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి బహుమానంగా అందజేశారు. వెంకటరెడ్డికి భార్య పుష్పలత, కుమారుడు మధుకర్‌రెడ్డి ఉన్నారు. ఆయన మృతికి స్థానిక నేతలు సంతాపం వ్యక్తం చేశారు.

కేన్సర్, కరోనరీ ఆర్టరీ వ్యాధికి ఏకకాలంలో శస్త్రచికిత్స

మన్సూరాబాద్: జననాంగ కేన్సర్, కరోనరీ ఆర్టరీ వ్యాధికి ఎల్‌బీనగర్‌లోని కామినేని హాస్పిటల్స్ వైద్యులు ఏకకాలంలో శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం హాస్పిటల్‌లో వైద్యులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఒంగోలుకు చెందిన వ్యక్తి (56)ఒక ప్రత్యేకమైన వైద్యపరమైన సవాల్‌తో హాస్పిటల్స్‌కు వచ్చాడన్నారు జననాంగ అల్సర్ రెండు నెలల చరిత్రను చూస్తే కేన్సర్ ఉన్నట్లు నిర్ధారణ అయ్యిందన్నారు. రోగికి రెండు గుండె ధమనుల సమస్యతో బాధపడుతున్నాడని, రోగికి మధుమేహ వ్యాధి ఉండటంతో శస్త్రచికిత్స హైరిస్క్‌గా మారిందన్నారు. కామినేని హాస్పిటల్స్ వైద్య బృందం సర్జికల్ ఆంకాలజిస్టులు డాక్టర్ కృష్ణకిరణ్, డాక్టర్ రామచంద్ర, సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ సాగర్ భూయార్, కార్డియో థొరాసిక్ సర్జన్ డాక్టర్ రాజేష్ దేశముఖ్,కార్డియాక్ అనస్థీసియా డాక్టర్ సురేష్ ఎసంపల్లిలు అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించి రోగికి నూతన జీవితాన్ని అందించామన్నారు.

సంక్షేమమే లక్ష్యం

హుడాకాంప్లెక్స్: సర్వజనుల సంక్షేమమే సబితమ్మ లక్ష్యమని మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి బేర బాలకిషన్ అన్నారు. విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి గెలుపునకై శుక్రవారం సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని హుడా కాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. యువ నాయకులు పట్లోళ్ల కళ్యాణ్‌రెడ్డితో కలిసి ప్రచార రథంలో ర్యాలీ చేపట్టారు. అనంతరం ఆయన మాట్లా డుతూ రాష్ట్రాన్ని ప్రజలు ఆశించిన స్థాయిలో ముఖ్యమంత్రి కేసీఆర్ అభివృద్ధి చేసి చూపారని, కాంగ్రెస్, బీజేపీ మాటలు ప్రజలు నమ్మే స్థితిలో లేరని తెలిపారు.

డ్రైనేజీలో దిగి మతిస్థిమితం లేని వ్యక్తి హంగామా!

బయటకు తీసిన డీఆర్ఎస్ సిబ్బంది



డ్రైనేజీ నీటి నుంచి అర్జున్‌ను బయటకు తీస్తున్న డీఆర్ఎఫ్ సిబ్బంది

నాగోలు: మతిస్థిమితం సరిగాలేని వ్యక్తి డ్రైనేజీ పైపులైన్‌లోకి దిగి హంగామా సృష్టించిన సంఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. వివిధ కాలనీల నుంచి వచ్చే డ్రైనేజీ నీరు మూసీలోకి పోయేందుకు అల్కాపురి చౌరస్తాలో లింకు ఏర్పాటు చేశారు. ఎవరూ లోపలికి వెళ్లకుండా దాని చుట్టూ జీహెచ్ఎంసీ అధికారులు ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. శుక్రవారం సాయంత్రం సమయంలో మతిస్థిమితం సరిగా లేని వ్యక్తి (35) డ్రైనేజీ పైపులైన్‌లోకి దిగాడు. డ్రైనేజీలో పొర్లుతూ మురుగునీరు తాగుతూ హంగామా సృష్టించాడు. అతడిని గమనించిన స్థానికులు డీఆర్ఎఫ్‌కు సమాచారం ఇచ్చారు. డీఆర్ఎఫ్ సిబ్బంది వచ్చి డ్రైనేజీలోకి దిగిన వ్యక్తిని బలవంతంగా బయటకు తీసుకొచ్చారు. అతని వివరాలు రాబట్టేందుకు పోలీసులు ఎంతో ప్రయత్నం చేసినా వీలుపడలేదు. తన పేరు అర్జున్ అని మాత్రమే హిందీలో చెప్పాడు.

మానవత్వం చాటుకున్న కానిస్టేబుల్

డ్రైనేజీ మురుగుతో కంపుకొడుతున్న అర్జున్ వద్దకు అల్కాపురి చౌరస్తాలో విధులు నిర్వహిస్తున్న ఎల్‌బీ నగర్ ట్రాఫిక్ కానిస్టేబుల్ ప్రదీప్‌కుమార్‌గౌడ్ వచ్చి మానవత్వం చాటుకున్నాడు. అర్జున్‌తో ఓపిగ్గా మాట్లాడుతూ స్నానం చేయించి ఒళ్లు తుడిచి సులభ్ కాంప్లెక్స్‌లో ఉన్న బట్టలు తెచ్చి అతడికి వేశాడు. అనంతరం 108ను పిలిపించి అతడికి తాకిన గాయాలకు ప్రాథమిక చికిత్స చేయించి అనంతరం చైతన్యపురి పోలీసులకు అప్పచెప్పారు.

గెస్ట్ ఆర్టిస్టులకు ప్రజాదరణ లేదు: సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో గెస్ట్ ఆర్టిస్టులుగా వస్తున్న నాయకులకు ప్రజాదరణలేదని, విపత్తు సమయంలో ప్రశ్నించే గొంతు అని చెప్పుకునే పీసీసీ అధ్యక్షుడు , మల్కాజిగిరి ఎంపీ రేవంత్‌రెడ్డి ఎక్కడ ఉన్నాడని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ప్రశ్నించారు. శుక్రవారం ఆయన ఎల్‌బీనగర్‌లో విలేకరులతో మాట్లాడుతూ, బీఆర్ఎస్‌కు ప్రజల ఆదరణ ఉందని ఎల్‌బీనగర్ అభివృద్ధికి ఇప్పటి వరకు సుమారుగా రూ. 3,178 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేశామని తెలిపారు. ఇక్కడి ఓటర్లు రేవంత్‌రెడ్డిని ఎంపీగా గా గెలిపిస్తే ఏ నాడైనా ఎల్‌బీనగర్‌లో కనిపించారా? అని ప్రశ్నించారు. గతంలో వరదల సమయంలో కాలనీలు మునిగి ప్రజలు ఇబ్బందులు పడ్డారని ఆ సమయంలో బీఆర్ఎస్ నాయకులు ప్రజలకు అండగా ఉన్నారని తెలిపారు. వరదల సమయలోగానీ ఫ్లైఓవర్ బ్రిడ్జి కూలిన ఘటనలో క్షతగాత్రులైన కూలీలనైన రేవంత్ రెడ్డి పరామర్శించారా? అని నిలదీశారు.